భూ సమస్యలపై సర్కార్ నజర్!



- రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు 2,885
- మ్యుటేషన్లు, సర్వేనంబర్ల తప్పులపైనే అధిక ఫిర్యాదులు
- పరిష్కారానికి 1,308 మందికి రెవెన్యూశాఖ నోటీసులు

సాక్షి,సిటీబ్యూరో: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామస్థాయి రెవెన్యూ సదస్సుల్లో వెల్లువలా దరఖాస్తులు వచ్చాయి. నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరిజిల్లాలో నిర్వహించిన 81 రెవెన్యూ సదస్సుల్లో 2,855 దరఖాస్తులు రైతులు, వివిధ వర్గాల ప్రజల నుంచి అందాయి.

మండలాల వారీగా దరఖాస్తులు..

మేడ్చల్ మండలంలోని 24 రెవెన్యూ గ్రామాల నుంచి 346 దరఖాస్తులు రాగా.. శామీర్‌పేట్ మండలంలోని 15 రెవెన్యూ గ్రామాల నుంచి 546, మూడుచింతలపల్లి మండలంలోని 17 రెవెన్యూ గ్రామాల నుంచి అత్యధికంగా 984, ఘట్‌కేసర్ మండలంలోని 17 రెవెన్యూ గ్రామాల నుంచి 552, దుండిగల్ గండిమైసమ్మ మండలంలోని 8 రెవెన్యూ గ్రామాల నుంచి 427 దరఖాస్తులు వచ్చాయి. ఈ నేపథ్యంలో దరఖాస్తుల పరిష్కారానికి 1,308 నోటీసులు జారీ అయ్యాయి.

- మేడ్చల్ మండలంలో 222, శామీర్‌పేట్‌లో 169, ఎంసీపల్లిలో 151, దుండిగల్‌లో 390, ఘట్‌కేసర్ మండలంలో 376 నోటీసులు ఉన్నాయి.

కేటగిరీల వారీగా దరఖాస్తులు..

జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతులు, ప్రజలు వివిధ రకాల భూ సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు. తమ భూములకు సంబంధించిన సర్వే నంబర్లు తప్పుగా ఉన్నాయని.. 752 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా.. మ్యుటేషన్ కోసం 378 మంది, డీఎస్ పెండింగ్‌పై 215, భూమి తక్కువగా నమోదైందని 269 మంది, భూమి స్వభావం తప్పుగా పడిందని 74 మంది, పట్టాదారుడి పేర్లు తప్పుగా ఉన్నాయని, 84 మంది, ప్రొహిబిట్ లిస్ట్ నుంచి తీసివేయాలని 170 మంది, నిషేధిత జాబితాలో పెట్టాలని 12 మంది, అసైన్డ్ భూములకు సంబంధించి ఫిర్యాదులు 244, ఓఆర్సీ జారీచేయాలని 31 దరఖాస్తులు రాగా.. 38–ఇ సర్టిఫికెట్ జారీకోసం 10, సక్సెషన్‌కు సంబంధించిన 358, భూసేకరణకు సంబంధించి 9, సాదా బైనామాకు సంబంధించి 122, భూ సర్వేకు 8. ఆధార్ సవరణకు 2, కోర్టు కేసులకు సంబంధించి 5, ఖాతా మెర్జింగ్ కోసం 8, సర్వే నెంబర్ డెలిషన్‌కు 17, కోర్టు ఆర్డర్‌కు 3, జీపీఏ 3, నాలా పీపీబీ 16, నాలా ట్రాన్స్‌ఫర్ 35, నేషనల్ ఖాతా నుంచి పట్టాకు 14, ఇతర భూ సమస్యలకు సంబంధించి 252 దరఖాస్తులు వచ్చాయి.

దరఖాస్తుల ఆధారంగా...

దరఖాస్తుల ఆధారంగా ఫిర్యాదు సమర్పించిన రైతులతో పాటు సమీపంలోని కర్షకులకు అధికారులు నోటీసులు జారీ చేస్తారు. ఇప్పటి వరకు జిల్లాలో 1,805 నోటీసులను సంబంధిత రైతులకు రెవెన్యూశాఖ అందజేసింది. ఇరువర్గాల వద్ద ఉన్న పత్రాలతో పాటు ఆధారాలను సమర్పించేందుకు 7 రోజుల గడువు విధిస్తారు. నిర్దేశిత గడువులోగా సమర్పించిన ఆధారాలు, పత్రాలను పరిశీలిస్తారు. వీటిని రెవెన్యూ కార్యాలయంలోని పత్రాలతో పోల్చుతారు. అనంతరం సదరు దరఖాస్తు వాస్తవికతను తేల్చనున్నారు.

భూ సమస్యపై భూభారతి పోర్టల్

ధరణి పోర్టల్‌తో భూ సమస్యల పరిష్కారానికి నోచుకోకపోవడంతో పాటు రెవెన్యూతో సహా సంబంధిత కార్యాలయాల చుట్టూ రైతులు, ప్రజలు ప్రదక్షిణలు చేసి విసుగుచెందారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూభారతి పోర్టల్‌ను ప్రారంభించింది. భూ భారతిపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు అధికార యంత్రాంగం జిల్లా, మండల, గ్రామస్థాయిల్లో సమావేశాలు నిర్వహించింది.

పెరిగిన ఆశలు..

ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ యంత్రాంగం దరఖాస్తులు స్వీకరించడంతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. తెల్ల కాగితాలపై రాసుకుని కొనుగోలు చేసిన భూముల క్రమబద్ధీకరణ జరగదని రైతులు భావిస్తున్నారు. కోర్టు చిక్కుముళ్లు వీడితే జిల్లాలో భూ సమస్య పరిష్కారానికి మార్గం సుగమం కానున్నట్లు తెలుస్తోంది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిజాంపేట్: ప్రశాంతి హిల్స్ సబ్‌స్టేషన్ 11కేవీ అల్లాపూర్ సొసైటీ ఫీడర్‌లో మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరోజిని అపార్ట్‌మెంట్స్, కోలన్ శ్రీనివాస్‌రెడ్డి ప్రాంతం, అల్లాపూర్ సొసైటీ, భవ్యాస్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



స్థానికులతో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని తన నివాసానికి వచ్చిన ప్రజల నుంచి వినతి పత్రాలు, ఆహ్వానాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గం అభివృద్ధికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చాలా సహకరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వీబీఐటీలో డిజైన్ మోడలింగ్‌పై జాతీయ సదస్సు



మాట్లాడుతున్న వీబీఐటీ చైర్మన్

ఘట్‌కేసర్: అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల (వీబీఐటీ) లో ' వీఎల్ఎస్ఐ డిజైన్, మోడలింగ్‌లో తాజా ధోరణులు ' అనే అంశంపై సోమవారం జాతీయస్థాయి సదస్సు నిర్వహించారు. డిజైన్ రంగంలో జరుగుతున్న తాజా అభివృద్ధి, పరిశోధన దిశలు, సాఫ్ట్‌వేర్ టూల్స్‌తో ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వీబీఐటీ చైర్మన్ డాక్టర్ గౌతమ్‌రావు, సెక్రటరీ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకు విలువైన సాంకేతిక నైపుణ్యానికి ఇలాంటి సదస్సులో విరివిగా పాల్గొనాలని, విద్యా పరిశోధన రంగాల్లో ఉన్నత ప్రమాణాలు సాధించడానికి ఈ సదస్సులు దోహదపడతాయని తెలిపారు. వీబీఐటీ ప్రిన్సిపాల్ పీవీఎస్ శ్రీనివాస్, ప్రోగ్రామ్ కో- ఆర్డినేటర్ విద్యాసాగర్, అధ్యాపకులు, పలు విద్యాసంస్థల పరిశోధకులు పాల్గొన్నారు.

సైబర్ వలలో క్యాబ్ డ్రైవర్!

రూ.1.23 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పోచారం: సైబర్ క్రైమ్ వలకు ఓ క్యాబ్ డ్రైవర్ చిక్కి రూ.1.23 లక్షలు పోగొట్టుకున్న ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పోచారంలోని కాకతీయ నగర్‌కు చెందిన మధుసూదన్‌రెడ్డి (41) క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి మే 5న తెలియని నెంబర్ నుంచి వాట్సాప్ వీడియో కాల్ వచ్చింది. కాల్‌కు సమాధానం ఇస్తుండగా.. అటువైపున మహిళ కనిపించడంతో కాల్‌ను కట్‌చేసి, ఫోన్ నెంబర్‌ను డిలీట్ చేశాడు. మరుసటి రోజు మధ్యాహ్నం మరో తెలియని నెంబర్ నుంచి ఫోన్ చేసి తాము యూట్యూబ్ నుంచి మాట్లాడుతున్నామని, తన వీడియో వైరల్ అవుతుందని, తర్వాత పోలీసు అధికారులు ఫోన్ చేస్తారని చెప్పి కాల్ కట్ చేశారు. 10 నిమిషాల తర్వాత ఢిల్లీ పోలీస్ కమిషనరేట్ నుంచి మాట్లాడుతున్నట్లు వాట్సాప్ వీడియో కాల్ వచ్చింది. యూట్యూబ్ వాళ్లకు ఫోన్ చేసి, వీడియో డిలీట్ చేయించి రిపోర్టు పంపమని చెప్పారు. అదే నెంబర్‌కు మధుసూదన్ ఫోన్ చేయగా.. 3 యూట్యూబ్ చానల్స్ వైరల్ అవుతున్నాయని, ఒక్కో చానల్‌ను డిలీట్ చేయడానికి రూ. 31 చెల్లించాలని ఫోన్‌లో వ్యక్తి డిమాండ్ చేశాడు. మే 6న బాధితుడు రూ.93 వేలు చెల్లించాడు. మరుసటి రోజు మరో రూ. 30వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. దీంతో మొత్తం రూ. 1.23 లక్షలు బదిలీచేసి, చివరకు తాను మోసపోయానని గ్రహించి మే 15న సైబర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. మంగళవారం పోచారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజావాణిలో 13 ఫిర్యాదులు



కుత్బుల్లాపూర్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్



ప్రజావాణిలో అధికారులతో ఆకుల సతీష్

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 13 ఫిర్యాదులు వచ్చాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 5 ఫిర్యాదులు రాగా వాటిలో 3 టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ శానిటేషన్‌పై ఒక్కో ఫిర్యాదు అందింది. అలాగే గాజులరామారం సర్కిల్ పరిధిలో ఉప కమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించగా 8 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో ఇంజినీరింగ్ 3, టౌన్ ప్లానింగ్ 4, యూసీడీ 1 ఫిర్యాదులు రాగా వాటిని సంబంధిత శాఖ అధికారులకు పంపి వచ్చే వారంలోగా పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అయితే అధికంగా అక్రమ నిర్మాణాలపై 6 ఫిర్యాదులు వచ్చాయి.

ప్రజావాణి నిర్వహణ ఇలాగేనా..?

బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీశ్

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌లో ప్రజావాణి ఇలాగేనా నిర్వహించేది అంటూ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీశ్ సోమవారం అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కమిషనర్, వివిధ అధికారులు సమక్షంలో ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించాలని కానీ వార్డు ఆఫీసర్‌తో ఆరుబయట చైర్లు వేసి ఫిర్యాదులు తీసుకుని స్టాంపేసి ఇవ్వడం సరికాదన్నారు. ఇప్పటికైనా అన్ని విభాగాల అధికారులతో కార్పొరేషన్ హాల్లో నిర్వహించాలని కోరారు.

ఘనంగా 'త్రివేణి విజయ అమృత వాహిని'



కార్యక్రమంలో విద్యార్థులు

కుత్బుల్లాపూర్: చింతల్‌లోని త్రివేణి స్కూల్‌లో 'త్రివేణి విజయ అమృత వాహిని' 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల సీఈఓ వెంకట్రావు మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో విద్యార్థుల విజయాలతో.. త్రివేణి నిష్ఠబద్ధంగా, నిరంతరం పని చేసుకుంటూ వెళుతోందని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు దిశగా ప్రయాణం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శివ కీర్తన, వైస్ ప్రిన్సిపాల్ నళిని క్యాంపస్ ఇన్‌చార్జి క్రాంతి, విద్యార్థులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్న ఆకుల సతీష్

కుత్బుల్లాపూర్: అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో ప్రోటోకాల్‌కు తిలోదకాలిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నిజాంపేట్ మున్సిపల్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీశ్ మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలతో నేరుగా సంబంధమున్న ప్రజాప్రతినిధులను పక్కనబెట్టి, అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు అధికారుల సహకారంతో స్వయంగా ప్రారంభోత్సవాలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. నిజాంపేట్, గాజులరామారం కమిషనర్లు సహా సంబంధిత అధికారులపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అలాగే పనుల ప్రారంభోత్సవాలు మున్సిపల్ చట్టం ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా నిర్వహించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అమలేశ్వరి, ఈశ్వర్ రెడ్డి, చందు, శ్రీనివాస్ పాల్గొన్నారు

విద్యార్థులకు నోట్‌బుక్కుల పంపిణీ



పంపిణీ చేసిన నోటుబుక్కులతో విద్యార్థులు, మాజీ కార్పొరేటర్

నిజాంపేట్: బాచుపల్లి, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీనగర్, సాయినగర్ ఎం.పి.పి.ఎస్ పాఠశాలలు, జడ్పీహెచ్ఎస్ బాచుపల్లి పాఠశాలలో మాజీ కార్పొరేటర్ ఆగంపాండు విద్యార్థులకు నోట్‌బుక్కులను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.సంగీతారాణి, ఎల్.పద్మజలత, గాలయ్య, అరుణ, ఎం.వి.వి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

సుభాష్‌నగర్: వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన సుధేపాండే (29), సునీల్ పాండే భార్యాభర్తలు కాగా వీరికి ఇద్దరు పిల్లలున్నారు. బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి సూరారం రాజీవ్‌గాంధీనగర్‌లో ఉంటున్నారు. భార్యాభర్తలిద్దరూ స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమలో కూలీలుగా పని చేస్తున్నారు. సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో సుధేపాండే ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దూలపల్లి చౌరస్తాలోని శ్రీ కన్వెన్షన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (50) పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు అతడిని పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

జగద్గిరిగుట్ట: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు చేసుకున్నాడు. జగద్గిరిగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆటో డ్రైవర్ నర్సింగరావు (45) కుటుంబంతో కలిసి సుమిత్రానగర్‌లో నివాసముంటాడు. కొంతకాలంగా మద్యానికి బానిస కావడంతో భార్యతో కుటుంబ కలహాలున్నాయి. జగద్గిరిగుట్ట హనుమాన్‌నగర్‌లోని సోదరుడు సంతోష్ ఇంటికి సోమవారం వచ్చాడు. ఇంట్లో వాళ్లు బయటకు వెళ్లగా తాళం పగులగొట్టి నర్సింగరావు ఇంట్లోకి వెళ్లి ఉరి వేసుకున్నాడు. స్థానికులు గమనించేసరికే చనిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని కింది బస్తీలో మున్సిపల్ అధికారులు కాంగ్రెస్ నేతలు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి ఇంటి నిర్మాణాలకు భూమిపూజ చేశారు. సోమవారం అధికారులు, కాంగ్రెస్‌నేతలు కింది బస్తీలో పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి ముగ్గులు పోసి ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. అర్హులందరికీ ఇళ్లు అందేలా చూస్తామన్నారు. కాంగ్రెస్ పట్టణ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మాజీ కౌన్సిలర్ మహేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ శంకర్, నాయకులు సంతోష్‌గౌడ్, రాకేష్, బిక్షపతి పాల్గొన్నారు.

ఎంపీ ఈటల రాజేందర్‌కు అవార్డు ప్రదానం



ఎంపీ ఈటలకు అవార్డు ప్రదానం చేస్తున్న దృశ్యం

నిజాంపేట్: మల్కాజిగిరి ఎంపీగా భారీ మెజార్టీతో గెలుపొంది ప్రజా సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్న తెలంగాణ ఈటల రాజేందర్ సేవలను విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ అభినందించింది. సేవలకు గుర్తింపుగా విశ్వ గురు వరల్డ్ రికార్డ్స్ వారు వాయిస్ ఆఫ్ ది వాయిస్ లెస్ అండ్ నేషన్స్ ప్రైడ్ బిరుదును సోమవారం ప్రదానం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 11ఏళ్ల పాలన, ఎంపీగా ఈటల ఏడాది పాలన సందర్భంగా ఏర్పాటు చేసిన సంకల్ప సభలో సంస్థ సీఈఓ డాక్టర్ సత్యవోలు రాంబాబు, సలహాదారులు డా.ఎమ్.ఆర్.ఎస్ రాజు, కృష్ణ ఆదిశేషు, రవిచరణ్, జీవీఎస్‌కే న్యూట్రసూటికల్స్ చైర్మన్ కిశోర్, విజయలక్ష్మి, రచ్చ చక్రధర్‌తో కలిసి ఈటలను అభినందించి అందించారు.

ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కాలనీ వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సూచించారు. గాజుల రామారం డివిజన్ కైసర్‌నగర్‌లోని డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయం నుంచి బాలానగర్ వరకు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసును సోమవారం ప్రారంభించి బస్సులో ప్రయాణించారు. కార్యక్రమంలో డిగ్నిటీ హౌసింగ్ ఫ్లాట్ ఓనర్స్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు సాధుల వేణు, సలహాదారులు సాజిద్, ఖాసీం, ఉపాధ్యక్షుడు ఎం.డి. అతిక్ రెహమాన్, ప్రధాన కార్యదర్శి ఎస్.కె.వలి, కోశాధికారి బింగి యాదగిరి, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, తెలంగాణ సాయి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపైనే వాహనాల పార్కింగ్..!



ఐడీపీఎల్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి సమీపంలో ఫుట్‌పాత్‌పై నిలిపిన బస్సు

రంగారెడ్డినగర్: పాదాచారులు నడిచేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు అక్రమ పార్కింగ్‌లకు అడ్డాగా మారుతున్నాయి. రంగారెడ్డి నగర్ డివిజన్ ఐడీపీఎల్ చౌరస్తాలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జి నుంచి బాలానగర్ రోడ్డులోని ఆదర్శనగర్ బస్టాప్ మధ్య ఫుట్‌పాత్‌లపై ప్రైవేట్ బస్సులు నిలుపుతున్నారు. దీంతో నడిచేందుకు కూడా వీలు లేకుండాపోతోందని పాదాచారులు వాపోతున్నారు. అంతేగాకుండా పార్కు చేస్తున్న భారీ వాహనాలతో ఫుట్‌పాత్ ధ్వంసమవుతోంది. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లపై అక్రమ పార్కింగ్‌లకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

ఉచిత చేతిరాత శిక్షణ శిబిరం ప్రారంభం



చేతిరాత మెళకువలు నేర్పిస్తున్న మల్లయ్య

జగద్గిరిగుట్ట: అందమైన చేతిరాత ఆత్మ విశ్వాసాన్ని పెంచడంతో పాటు, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తూ పరీక్షల్లో అధిక మార్కులు సాధించేందుకు ఉపయోగపడుతుందని జగద్గిరిగుట్ట జడ్పీ పాఠశాల హెచ్ఎం సుభాష్ చంద్రాబోస్ రెడ్డి అన్నారు. జితేందర్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో పాఠశాలలో వారం రోజుల పాటు నిర్వహించే ఉచిత ల్యూసిడా చేతిరాత శిక్షణా శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. మొదటి రోజు నాలుగు సెక్షన్లతో కలిపి 215 మంది విద్యార్థులు పాల్గొని చేతిరాత మెళకువలు నేర్చుకున్నారు. అకాడమీ డైరెక్టర్ వంపు మల్లయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు విజయం సాధించేందుకు చేతిరాత ఉపయోగ పడుతుందని, క్యాలీగ్రఫీ టెక్నిక్‌తో దీనిని సాధించవచ్చని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాష్, రత్నం, నరేందర్ రెడ్డి, త్రివేణి, విద్యార్థులు పాల్గొన్నారు.



వైభవంగా కల్యాణోత్సవం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్ వేంకటేశ్వర ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన ఏర్పాటు చేశారు.. ఆలయ కమిటీ చైర్మన్ రామాచారి, కమిటీ సభ్యులు, వివిధ కాలనీల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి

నిజాంపేట్: 18వ డివిజన్ సాయి అనురాగ్‌కాలనీ రోడ్డు నంబర్ 4 తన్విల్స్ నుంచి రోడ్ నంబర్ 1 కావ్య అవెన్యూ వరకు యూజీడీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి చొరవ తీసుకుని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు దాదాపు రూ. 23 లక్షలు మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపాల్ కార్పొరేషన్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కొలన్ బాల్‌రెడ్డి, 18వ డివిజన్ అధ్యక్షుడు రాజేందర్, యూత్ ప్రెసిడెంట్ జిత్తు, నందనవనం మురళి, తన్విహిల్స్ వంశీ, కావ్య అవెన్యూ ప్రెసిడెంట్ శ్రీకాంత్, జనరల్ సెక్రటరీ రామకృష్ణ, సేవా సమితి ప్రెసిడెంట్ షబీర్, రామకృష్ణ, శ్రీనివాస్, సాయి అనురాగ్ కాలనీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెరోల్‌పై వచ్చి.. చోరీలు చేసి..

పోలీసులకు చిక్కిన నిందితుడు

దుండిగల్: పెరోల్‌పై జైలు నుంచి బయటకు వచ్చి దొంగతనాలు చేసి పోలీసులకు చిక్కిన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా శంకరంపేట్ మండలం మక్త లక్ష్మాపూర్ ప్రాంతానికి చెందిన గొండ్ల రాములు అలియాస్ రమేశ్ (42) కుటుంబ ఆస్తి తగాదాల్లో 2016 లో తండ్రి ఆగమయ్యను హత్య చేశాడు. కోర్టు నిందితుడిని దోషిగా నిర్ధారించి 2018లో జీవిత ఖైదు విధించింది. రమేశ్‌కు భార్యతో పాటు ఇద్దరు మైనర్ ఆడపిల్లలు ఉన్నారు. కాగా రమేశ్ మే 26 న నెల రోజుల పాటు చర్లపల్లి జైలు నుంచి పెరోల్‌పై బయటకు వచ్చాడు. తన పిల్లలకు ఆర్థికంగా సాయం చేయాలనే ఉద్దేశంలో జైలుకు వెళ్లే ముందు దొంగతనాలు చేసి వచ్చే డబ్బులను పిల్లలకు ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాక్టర్, ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలతో మల్లంపేటలోని తన భార్య ఇంట్లో ఉన్న రమేశ్‌ను అదుపులోకి తీసుకుని ట్రాక్టర్, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని రమేశ్‌ను రిమాండ్‌కు తరలించారు.